

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ అలీషా




కమిషనర్ను సత్కరిస్తున్న మేనేజర్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్గా అహ్మద్ అలీషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్ఛార్జ్ కమిషనర్గా ఉన్న ఎన్. కనకారావు సెలవులో ఉన్నారు. దీంతో నగర పంచాయతీలో ఎలాంటి విధులు నిర్వహిస్తున్న అలీషాను ఉన్నతాధికారులు కమిషనర్గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అలీషాకు మేనేజర్ నవీన్చంద్ర, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తునిలో పడకేసిన పారిశుధ్యం

- రోడ్లపైనే నిలిచిపోతున్న మురుగునీరు
- పందులు, దోమలు, ఈగలు స్వైరవిహారం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కొత్త ఉప్పరగూడెంలో అధ్వానంగా ఉన్న వీధి రోడ్డు(పేరుకుపోయిన చెత్త ఇన్సెట్లో)

ప్రజాశక్తి - తుని

పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా తుని పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడటం లేదు. పట్టణంలో 30 వార్డుల్లో 80 వేల నుంచి 90 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. పెరిగిన జనాభా కనుగుణంగా రోడ్ల విస్తరణ, డ్రెయినేజీ వ్యవస్థను విస్తరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని 22వ వార్డు కొత్త ఉప్పరగూడెంలో సుమారు 350 గృహాలలో 1650 మంది జనాభా ఉన్నారు. పూర్తిస్థాయిలో సిసి రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు నిలిచిపోతుంది. వర్షం పడితే మురుగునీరు, వర్షపు నీరు కలిసిపోయి రోడ్లపైనే నిలిచిపోతుంది. దీంతో ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు వేసినా డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ఆయా ఇళ్లలో వినియోగించిన నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతుంది. వర్షపునీటితో మురుగునీరు కలిసిపోయి రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. దీంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా రోడ్లు నిలుస్తున్నాయి. నిల్వ ఉండిపోయిన మురికి నీరు దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు సత్తిబాబు, గోవిందు, సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే తీరు పట్టణంలోని అనేక ప్రాంతాల్లో కన్పిస్తోంది. డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు నిలిచిపోవడంతో పందులు, దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి.

పాఠశాల, అంగన్వాడీ సెంటర్కు వెళ్లే చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మార్కురాజుపేట సమీపంలో తుని ఏరియా ఆసుపత్రి, మార్కెట్ యార్డ్ రోడ్లో గతంలో పబ్లిక్ టాయిలెట్స్ను ఏర్పాటు చేసినప్పటికీ దాని నిర్వహణ చేయకపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుందని బాటసారులు, ద్విచక్ర వాహనదారులు విమర్శిస్తున్నారు. ప్రధాన రహదారిలో పశువులను వదిలేయడంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆవులు, ఎద్దులు పోట్లాడుకునే సందర్భంలో ద్విచక్రవాహనదారులు, పాదచారులు వాటి భారిన పడి ప్రమాదాలకు గురౌతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి పెరిగిన జనాభాకు అనుగుణంగా సిసి రోడ్లు, డ్రయినేజీలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది కొరత



మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బంది కొరత ఉంది. వాస్తవంగా 70 మంది పారిశుధ్య కార్మికులు ఉండాలి. ప్రస్తుతం 30 మంది మాత్రమే ఉన్నార. పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యత. ప్రజలు సహకరించాలి. ఉన్న సిబ్బందితో పారిశుధ్య పనులను చేపడుతున్నాం.

-ఎ.వెంకటరావు, మున్సిపల్ మిషనర్, తుని.

కార్మికులను నియమించాలి



పట్టణంలో సిసిరోడ్డు, డ్రయినేజీలను నిర్మించాలి. పారిశుధ్యం సక్రంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే పారిశుధ్య కార్మికులను నియమించాలి. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.

-నక్కల శ్రీనివాస్, సిపిఎం మండల కార్యదర్శి.



పెద్దాపురంలో జరిగిన రైతు సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సునీత

తగిన జాగ్రత్తలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - గండేపల్లి, పెద్దాపురం

మామిడి తోట రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించగలుగుతారని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎన్వి.రఘునందన్ అన్నారు. గురువారం మండలంలోని కె.గోపాలపురం గ్రామంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడీ మామిడిలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, కత్తిరింపులు, సమగ్ర సస్యరక్షణ వంటి చర్యలు చేపడితే నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి ఎ.శ్రీవల్లి, సర్పంచ్ కర్రి.రామాంజనేయులు, నాయకులు అవసరాల.బాలసుబ్రహ్మణ్యం, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలం చిన్న బ్రహ్మదేవం, కొండపల్లి గ్రామాల్లో మామిడి, జీడిమామిడి రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సునీత పాల్గొని మాట్లాడారు. మామిడి, జీడిమామిడి రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అవసరమైన సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపి పీడీ జివివి.ప్రసాద్, ఉద్యాన వన అధికారి కె.సత్య శైలజ, రైతులు పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



పోస్టర్ను ఆవిష్కరిస్తున్న గిరిబాబు, వైసిపి శ్రేణులు

వైద్య విద్య ప్రయివేటీకరణను అడ్డుకుని తీరుతామని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. గురువారం స్థానికంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్య విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వైద్య కళాశాలల నిర్మాణాలను ప్రారంభించిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ కళాశాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్య విద్య ప్రయివేటీ కరణ కాకుండా అడ్డుకుంటామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు దాట్ల సూర్యనారాయణరాజు, ముదునూరి మురళీకృష్ణంరాజు, ఒమ్మి రఘురాం, మాజీ ఎంఎల్సి అంగూరి లక్ష్మీశివకుమారి, నాయకులు బెహరా దొరబాబు, వాసిరెడ్డి జమీల్, రామిశెట్టి నాని, జడ్పిటిసి బెహరా రాజేశ్వరి, జల్లిగంపల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య ప్రొఫెసర్కు ఉత్తమ బోధకుని పురస్కారం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలేపు నారాయణరావు సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీ ఇంటర్నేషనల్ డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ ఉత్తమ బోధకుని పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో సంస్థ సిఇఒ డాక్టర్ ప్రసాద్, ఎఐసిటిఇ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అవార్డు గ్రహీత నారాయణరావుకు ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్రెడ్డి, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమేష్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ ఆర్వివి.కృష్ణ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



అవార్డుతో ప్రొఫెసర్ పాలెపు నారాయణరావు

ముగిసిన పోషకాహార మాసోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జ్యోతుల నవీన్

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న పోషకాహార మాసోత్సవం గురువారంతో ముగిసింది. స్థానిక స్త్రీ శక్తి భవనంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి సిడిపిఒ ఎం.పూర్ణిమ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ పిల్లలు ఎదుగుదలకు తల్లుల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం గత నెల 17 నుంచి ఈ నెల 16 వరకూ పోషకాహార మాసోత్సవాన్ని నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్రావు, నాయకులు కోర్పు సాయితేజ, సుంకవల్లి రాజారావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, సుంకపల్లి రమేష్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకట్, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

బాణసంచా వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి జగన్నాథం శ్రీహరి సూచించారు. గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బాణసంచా తయారీదారులు, విక్రయదారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది బాణసంచా తాత్కాలిక విక్రయదారులకు ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసిందన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఎస్ఐ వి.మౌనిక, బాణసంచా తయారీదారులు, విక్రయదారులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవులో లైసెన్సుదారులు, వ్యాపారులతో జరిగిన సమావేశంలో తహశీల్దార్ పితాని త్రినాధరావు మాట్లాడారు. దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలను నివాస ప్రాంతాలకు దూరంగా వేయాలని అన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పెద్దాపురంలో మాట్లాడతున్న జగన్నాథం శ్రీహరి

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని కొండవరం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ చట్టం పనులను ఎంపిడిఒ లక్ష్మీ రెడ్డి గురువారం పరిశీలించారు. పశువుల షెడ్డు, కాలువల్లో పూడిక తీత, ఆర్ఎస్కె, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, సచివాలయాలను పరిశీలించారు. ఉపాధి హామీ చట్టంలో అవకతవకులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

శృతిమించుతున్న ప్రభుత్వ అరాచకాలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కూటమి ప్రభుత్వ అరాచకాలు శృతి మించుతున్నాయని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి గురువారం ఒక ప్రకటనలో విమర్శంచారు. మద్యం అమ్మకాల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని వైసిపి పాలనలోనే అమలులోకి వచ్చిందని, అదే విధానాన్ని కూటమి ప్రభుత్వం అవలంభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రజల దృష్టిని మరల్చే రాజకీయాలు చేస్తుందని ఆమె ఆరోపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేట గ్రామంలో 33/11 కెవి పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్డిఎస్.ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ సబ్స్టేషన్ లైన్ వర్క్లో భాగంగా అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారుల సహకరించాలని ఆయన కోరారు.


అవినీతి ఆరోపణలపై ఆర్డిఒ విచారణ

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

మండల డిప్యూటీ తహశీల్దార్ మురళీకృష్ణపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆర్డిఒ ఎస్.మల్లిబాబు గురువారం విచారణ చేశారు. ఎఫ్ఎంసి భూ తగాదాలు, ఇతర విషయాలలో డిటి అవినీతికి పాల్పడినట్లు బిజెపి స్టేట్ కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీనివాస్రావు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డిఒ విచారణ నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని తెలిపారు.

రైల్వే ఎడిఎన్కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - సామర్లకోట



బదిలీపై వెళ్తున్న శివప్రసాద్ను సత్కరిస్తున్న రమేష్

స్థానిక రైల్వే స్టేషన్లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్గా పని చేస్తూ బదిలీపై భీమవరం వెళ్తున్న బి.శివప్రసాద్కు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో వీడ్కోలు సత్కార సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శివప్రసాద్ సేవలను కొని యాడారు. అలాగే ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన టి.ప్రభాకరరావుకు రైల్వే ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటపాటల ద్వారా రైతులకు అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

వరి పంట సాగులో పాటించాల్సిన మెలకువలపై ఆటపాటల ద్వారా రైతాంగానికి అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని పి మల్లవరంలో నిర్వహించిన 10వ పొలంబడి కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో శత్రు, మిత్ర పురుగులను గుర్తించి శత్రు పురుగులను మాత్రమే నాశనం చేయాలని తెలిపారు. పొలంలో పోషక విలువలు పెంపొందించే విధానం, నీటి యాజమాన్యం వంటి పద్ధతులు వివరించారు. మాస్టర్ ట్రైనర్ ధనలక్ష్మి సాగులో భూమి పోషకాలు పెరగడానికి పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంపన రామకృష్ణ, ఎఇఒ సిహెచ్.గౌతమి, రైతులు ధూళిపూడి వెంకటరమణ, చంటి, నాగరాజు, నాగార్జున, పాపారావు, వర్మ, పాండురంగారావు, సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఆర్పై శిక్షణ

ప్రజాశక్తి - కరప



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దివ్య

మండలంలోని గురజనాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు సిపిఆర్పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.దివ్య సిపిఆర్ ఎలా చేయాలో వివరించారు. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడటానికి సిపిఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఒక ప్రాణం కాపాడటం అంటే ఒక కుటుంబాన్ని నిలబెట్టడమేనని అన్నారు. సిపిఆర్ను ప్రతీ ఒక్కరూ నేర్చుకోవడం మంచిదన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ హాస్పటల్ అవార్డు అందుకున్న డాక్టర్ దివ్యను హెచ్ఎం, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కారక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సాయిమోహన్, యోగ టీచర్ ఎ.బాబ్జీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీలో కిట్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెద్దాపురం



విజేతలకు కళాశాల యాజమాన్యం ప్రతినిధులు

దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు జెఎన్టియుకె కబడ్డీ జట్టులో స్థానం సంపాదించి ప్రతిభ చాటారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ మెన్ కబడ్డీ పోటీలలో ఈ విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో మెరిశారు. జట్టులో చోటు సంపాదించిన విద్యార్థులు అభినాష్, చక్రి, వంశీ, దశరధలను కాలేజీ ఛైర్మన్ శ్రీనివాస్రావు, ప్రిన్సిపల్ గిరిధర్, డైరెక్టర్ సృజన్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ సర్వరమేశ్వరుడు, పీడీ స్వామి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ శ్రీనివాస్రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కళాశాలతోపాటు, జెఎన్టియుకెకి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు


ప్రజాశక్తి - గొల్లప్రోలు



కేక్ను కట్ చేస్తున్న టిడిపి శ్రేణులు

విశాఖపట్నంలో గూగుల్ సంస్థ రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని మాజీ ఎంఎల్ఎ ఎస్విఎస్-ఎస్.వర్మ అన్నారు. గురువారం పట్టణంలో గూగుల్ రాకపై టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కేక్ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినందుకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, మాజీ జడ్పిటిసి మడికి ప్రసాద్, టిడిపి నాయకులు గుళ్ళ సుబ్బారావు, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఏడుకొండలు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - తాళ్లరేవు



సభలో మాట్లాడుతున్న మండలి జాతీయ అధ్యక్షులు మాస్టర్జీ

విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పలువురు అభిప్రాయపడ్డారు. గురువారం మండలంలోని సుంకరపాలెం పంచాయతీ బాబానగర్లో ఏడుకొండలు సంస్మరణ సభ విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ కాశి రామారావు అధ్యక్షతన జరిగింది. తొలుత ఏడుకొండలు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వజన కళా మండలి జాతీయ అధ్యక్షులు మాస్టర్ జి సమాజానికి ఏడుకొండలు చేసిన సేవలపై ప్రత్యేక గీతాన్ని ఆలపించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఏడుకొండలు చిన్న తనం నుంచి పోరాట పటిమ ఉన్న నేతని కొనియాడారు. అనేక దళిత ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. మండలంలో ప్రజా సంఘాలు ఏ కార్యక్రమం తల పెట్టినా అందులో భాగస్వామిగా ఉండేవారని తెలిపారు. వామపక్ష ఉద్యమాలకు ఏడుకొండలు తన వంతు సహకారాన్ని అందించారని సిపిఎం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్. శ్రీనివాస్, మోర్త రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి మాజీ రాష్ట్ర అధ్యక్షులు వడ్డి నాగేశ్వరరావు, ముమ్మిడివరం ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, నాయకులు జక్కల ప్రసాద్బాబు, యడ్ల కుటుంబరావు, గిడ్ల వీరప్రసాద్, కమల, కాశి లక్ష్మణస్వామి, ఉంగరాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ రూరల్లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ పంతం, ఎంపి సతీష్

జిఎస్టి తగ్గింపుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం, కాకినాడ రూరల్

జిఎస్టి తగ్గింపుపై గురువారం పట్టణంలో అవగాహనా ర్యాలీ జరిగింది. రవాణా శాఖ, రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, కౌన్సిలర్ ఓబులుశెట్టి గుణేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, సామర్లకోట పట్టణ జనసేన అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాస్, ఇతర నాయకలు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్ మండలంలో జిఎస్టి తగ్గింపుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎంఎల్ఎ పంతం నానాజీ పాల్గొన్నారు. సర్పవరం జంక్షన్ నుంచి నాగమల్లి తోట జంక్షన్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఎస్టి తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తాండవ రిజర్వాయర్‌లో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

తాండవ రిజర్వాయర్‌లో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... తాండవ రిజర్వాయర్‌లో ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారంతో సంఘటనా ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మతుడు అల్లిపూడి గ్రామానికి చెందిన వడ్డమూరి పెద్దింట్ల అలియాస్ శ్రీను(36) గుర్తించారు. బుధవారం ఉదయం స్నానం చేసి వస్తానని ఇంటి దగ్గర నుంచి వెళ్లిన అతను గురువారం రిజర్వాయర్‌లో మృతి చెంది తేలాడు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం సమీపంలో సూర్యారావుపేటలో భర్తతో వివాదం కారణంగా నాగరాజు శ్రీజ్యోతి (25) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీజ్యోతి తల్లి దుబాయ్ ఉంటూ ఆమెకు డబ్బులు పంపుతోంది. వీటిని భర్త కృష్ణ తీసుకుని జులాయిగా ఖర్చు చేస్తున్నాడని భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడ్డారు. దీనిపై తీవ్ర మనస్తాపం చెంది శ్రీజ్యోతి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఏడాదిన్నర, ఎనిమిది నెలల కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోసం కేసులో యువకునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రాజాంపేట గ్రామానికి చెందిన యువతిని ఒక యువకుడు పెళ్లి పేరుతో మోసం చేసిన సంఘటనలో కోర్టు నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించింది. పెళ్లి పేరుతో నమ్మించి, ఆమె నుంచి సుమారు రూ. 8 లక్షల నగదు, మూడు కాసుల బంగారాన్ని అపహరించినట్లుగా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం వెంగళ్లపెళ్లికి చెందిన చిట్టి పైడిరాజు అలియాస్ గుగుల్, అలియాస్ యశ్వంత్ రాజ్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ డి.రాంకుమార్ తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో వృద్ధునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రాపాక గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురు, అదే గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన సంఘటనలో పోలీసులు నిందితుని అరెస్టు చేశారు. రాపాక గ్రామానికి చెందిన బాబిశెట్టి మంగయ్య అదే గ్రామానికి చెందిన వృద్ధురాలిపై బుధవారం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగయ్యను అరెస్టు కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

ఆస్తి కోసం తల్లిదండ్రులు, సోదరునిపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో ఆస్తి వివాదాల కారణంగా కుటుంబ సభ్యుల మధ్య కలహాలు తలెత్తాయి. మాధవరపు సత్యనారాయణ కుమారుడైన రవికుమార్ తన అన్నలు మాధవరపు శ్రీనివాసరావు, మాధవరపు చంద్రగిరి, మాధవరపు శివనాగ సత్య సాయిపై సీతానగరం మండలం పోలీసులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. తన అన్నదమ్ములు కలిసి తమ తల్లిదండ్రులు మాధవరపు సత్యనారాయణ, సత్యవతిని ఆస్తి కోసం చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపారు. అక్టోబర్ 14 రాత్రి 9 గం టలకు తల్లిని జుట్టు పట్టి కిందకు ఈడ్చి దవడపై కొట్టారని, అడ్డుకోవడానికి ప్రయత్నించిన తనపై ముగ్గురూ కలిసి కొట్టారని తెలిపారు. తమ ఇంట్లో తల్లి దం డ్రులకు, తమకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణంలో పలు హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ ఛానెళ్లలో బిర్యానీ లో మండ్రకప్ప ఆకతాయిలు అంటూ వచ్చిన వార్త నేపధ్యంలో అధికారులు ఈ దాడులు చేపట్టారు. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి జె.రామయ్య, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, లైసెన్స్ వివరాల ఇతర అంశాలను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.

పోషకాహారంతోనే ఆరోగ్య సంరక్షణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గర్భిణులు, బాలింతలు పోషకాహారంతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ముమ్మిడివరం ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.నిహారిక పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నందు గురువారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవ ముగింపు వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నిహారిక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో ఎదురయ్యే రక్తహీనతను అధిగమించేందుకు పోషక విలువలు ఉన్న సంతులిత పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఉత్తమం అన్నారు. అలాగే పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఊబకాయాన్ని అదుపు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సోషల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కస్సిరెడ్డి వెంకటేశ్వరరావు, గర్భిణీలు, బాలింతలు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎపి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి శ్రీను, గిరిబాబు అన్నారు. గురువారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ బ్రాంచ్ బి రమాదేవి అధ్యక్షతన జరిగిన మెడికల్ ఎంప్లాయిస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ ఎంప్లాయిస్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించు కొనేందుకు ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని, ఐక్య పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం అవుతాయి అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు సుబ్బారావు, మోహన్, ప్రసన్న, ఎపిటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకులు రవికుమార్, ఎన్.సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దాపురం యూనిట్ నుంచి బి.రమాదేవి బ్రాంచ్ కన్వీనర్‌గా, కో కన్వీనర్‌గా శారద కమలకుమారి ఎంపిక చేశారు.



ఐక్యత ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ ఉద్యోగులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది: ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - వీరేశ్వరం

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంత పవిత్రమైనదని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం స్థానిక కల్యాణ మండపంలో ఉపాధ్యాయుల వృత్తిలో ప్రవేశించిన 79 మంది ఉపాధ్యాయులను ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య ఉపాధి కల్పనలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం రవాణా శాఖ ఆధ్వర్యంలో జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, జ్యోతుల పెదబాబు, కొమ్ముల కన్నబాబు, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పెంటకోట మోహన్ చిక్కాల లక్ష్మణరావు, బద్ది రామారావు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు మెమొంటోలు ఇస్తున్న సత్యప్రభ

కష్టపడే వారికి తగిన గుర్తింపు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కష్టపడే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి, నియోజకవర్గ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో స్టేట్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎ కరీం భాషాతో పాటు, నూతనంగా ఎన్నుకోబడిన నియోజకవర్గం ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు నాజ్ వల్లి, ఇతర సభ్యులు కురసాలను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ నియామకానికి కృషి చేసిన కన్నబాబు, జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్‌లు ఎండి చాంద్ భాషా, ఎండి కాజా మొహిద్దిన్, జనరల్ సెక్రెటరీ సయ్యద్ జహీరుద్దీన్ గౌస్, ఎండి కరీముల్లా, షేక్ అమీన్, షేక్ నాగూర్ సాహెబ్, ఎండి ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.



కన్నబాబును సత్కరిస్తున్న మైనార్టీ సెల్ నాయకులు

బాణసంచా విక్రేతలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దీపావళి బాణాసంచా విక్రయించే దుకాణాల వద్ద ప్రమాదాల నివారణకు దుకాణదారులు ముందస్తుగా అన్ని జాగ్రత్తలూ పాటించాలని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. గురువారం మండల కేంద్రం ఉండ్రాజవరంలో అనుమతి పొందిన బాణసంచా దుకాణదారులు దుకాణాలు ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్న పొరపాటుకు పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది కనుక ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. దుకాణదారులు తప్పనిసరిగా అన్ని జాగ్రత్తలూ పాటించాలన్నారు. ముందస్తు జాగ్రత్తగా ఇసుక, బకెట్లలో నీరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల వద్ద అగరబత్తులు ముట్టించవద్దన్నారు. కొనుగోలుదారులు, ప్రజలు, ఎవరైనా దుకాణాల వద్ద సిగరెట్లు తాగకుండా చూసు కోవాలన్నారు. ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎఇ రమేష్‌బాబు, నిడదవోలు ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ సిహెచ్‌బివిఎస్.రాజు, విఆర్ఒ పాపారావు, దుకాణదారులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

ప్రజాశక్తి - రావులపాలెం

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు.గురువారం స్థానిక సిఆర్‌సిలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా సిఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాలు వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు, రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంత కుమారి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, డిఎస్‌పి సుంకర మురళీమోహన్, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.నాగమణి, సిఆర్‌సి రూప శిల్పి డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఈ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసిన సిఆర్‌సి సభ్యులను అభినందించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యం గా ఉంటుం దన్నారు. మహిళలు సమతుల్యమైన పోషక ఆహారాన్ని తీసుకో వాలని సూచించారు. మన ఇంటి పరిసరాల్లో సేంద్రియ విధాన ంలో ఆకుకూరలు పండించి వినియోగించుకుంటే ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉండవని సూచించారు. కిషోర బాలికల ఆరోగ్యంపై దష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందచేసే పౌష్టికాహారం తీసుకోవడం మూలంగా గర్భిణులు, శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సేవాభావంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 4 వందల మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌సి అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లిమిల్లి వీరరాఘవరెడ్డి, సేవా విభాగం డైరెక్టర్ సత్తి సూర్యభాస్కరరెడ్డి, నందం వీరవెంకట సత్యనారాయణ, ఓల్డేజ్ హోమ్ అధ్యక్షుడు వేగేశ్న రామరాజు, సిడిపిఒ ఎ.గజలక్ష్మి, తహశీల్దార్ బిఎం ముక్తేశ్వరరావు, సూపర్ వైజర్లు, కూటమి నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడి కార్డుల అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం పిఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నూతన ఐడి కార్డులు, డైరీలను పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం ఎం.శ్యామలా దేవి గురువారం తెలిపారు. పిల్లల భద్రత కోసం చైల్డ్ ట్రాకింగ్ సదుపాయం గల అధునాతన ఐడి కార్డులను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు రోజువారీ హోమ్ వర్క్ వివరాలను తల్లిదండ్రులకు తెలియజేసే విధంగా ప్రత్యేకంగా రూపొందించిన డైరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ పిల్లి జ్యోతి, కూటమి నాయకులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై నివేదిక ఇవ్వాలి

ప్రజాశక్తి - కొత్తపేట

పెండింగ్ కేసులపై త్వరితగతిన తదుపరి చర్య, ని వేదికలు వెంటనే పంపవలసినదిగా ఎస్‌సి, ఎస్‌టి మోని టరింగ్ కమిటీ ఛైర్మన్ మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి పి. శ్రీకర్‌కోరారు. వారి సమక్షంలో ఎస్‌సి, ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ సమావేశం గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేశారు. సమావేశానికి డిఎస్‌పి యస్.మురళీమోహన్, కమిటీ సభ్యులు అం దరూ హాజరయ్యారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే సదరు విషయాలను కమిటీ దృష్టికి తీసుకోనిరావాలని కమిటీ సభ్యులను కోరారు. ప్రతి 3 నెలలకొకసారి నిర్వహించే ఈ సమావేశానికి ముందస్తుగా సమస్యలను/సలహాలను, సూచనలు పంపించా లన్నారు. సమస్యలపై తీసు కొన్న చర్యలను తెలియజేసే నివేదికలు సమర్పించాలన్నారు. సమావేశంలో కొత్తపేట డివిజన్ లోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎఎస్‌డబ్ల్యూఒ కొత్తపేట, రెవెన్యూచ పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎంసి వైస్ ఛైర్మన్ రతీదేవికి ఘన సన్మానం

ప్రజాశక్తి-నిడదవోలు

నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా నియమితులైన నిడదవోలు మున్సిపల్ కౌన్సిలర్ పువ్వుల రతీదేవిని గురువారం పురపాలక సంఘం కార్యాలయంలో ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 20 ఏళ్ల సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ కౌన్సిలర్‌ను అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా ఎంపిక చేయడం హర్షణీయం అన్నారు. మున్సిపల్ కమిషనర్ తోట శ్రీకృష్ణవేణి, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది, రతి దేవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తనపై ఉంచిన నమ్మకా న్ని వమ్ము చేయకుండా, ఈ శాఖకు, ఈ పదవికి మరింత వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తానని, నిడదవోలులో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మిం చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్య క్రమంలో వైస్ ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, సింగవరం సొసైటీ ప్రెసిడెంట్ పెన్మత్స చందు పాల్గొన్నారు

ఆలమూరు విలీనంపై జెఎసి కార్యాచరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో కలపాలనే డిమాండ్‌పై జెఎసి ఏర్పాటైన విషయం విదితమే. ఈ మేరకు గురువారం జెఎసి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సమత కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో కార్యాచరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు, ఉద్యోగులు అందరూ ముక్తకంఠంతో ఆలమూరు మండలాన్ని రాజమహేంద్రవరంలో కలపాలని కోరుకుంటున్నారన్నారు. మన పక్క నియోజకవర్గమైన మండపేటను కోనసీమ నుంచి వేరుచేసి రాజమహేంద్రవరంలో కలపాలని అక్కడ ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రభుత్వం దృష్టికి, జిల్లాల విభజన కమిటీ దష్టికి తీసుకెళ్లామన్నారు. మన ఆలమూరు మండల జెఎసి నాయకుల ఆధ్వర్యంలో మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజలందరూ కలసి ప్రస్తుత మన శాసనసభ్యులైనటువంటి బండారు సత్యా నంద రావు దష్టికి మన ఆవేదనను మన మండలం నుంచి అమలాపురం వెళ్లడానికి, పడే ఇబ్బందులను తీసుకువెళ్లి మన మండలాన్ని రాజమహేంద్రవరంలో కలిపేలా ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్ల వలసిం దిగా ఎంఎల్‌ఎను జెఎసి కోరేందుకు తీర్మానించారు. ఈ నెల 27న ఈ కరపత్రాలతో పాటు స్థానిక తహ శీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ లకు వినతి పత్రాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు నాతి కుమార్ రాజా, కొండే రామకష్ణ, కొపనాతి శ్రీనివాసరావు, తాడి మధుసూదన్ రెడ్డి, యాళ్ల రవిరాజ్, కట్ట సత్య ప్రసాద్, మిద్దె పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మేడపాటి శ్రీనివాసరెడ్డి

ఆదిత్యలో ప్రపంచ ఆహార దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ ఫుడ్ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ డాక్టర్ ఎంవి.రాజేష్, విభాగాధిపతి డాక్టర్ బి.కృష్ణకాంత్, కో.ఆర్డినేటర్లు డాక్టర్ విఎస్.కృష్ణ, రంగినేని మానస, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సిఐకి వినతిపత్రం ఇస్తున్న గిరిబాబు, ఇతరులు

కల్తీ మద్యంపై వైసిపి నిరసన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నకిలీ మద్యంపై వైసిపి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. గురువారం స్థానిక మెయిన్ రోడ్డు నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ జరిగిన ఈ ర్యాలీలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని ఎక్సైజ్ సిఐ శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు దాట్ల సూర్యనారాయణరాజు, ముదునూరి మురళీకృష్ణంరాజు, నాయకులు ఒమ్మి రఘురాం, బెహరా దొరబాబు, బెహరా రాజరాజేశ్వరి, జల్లి గంపల ప్రభాకర్‌రావు, రామిశెట్టి నాని, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలలో 3 పథకాలు

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో బాక్సింగ్ పోటీలలో పట్టణానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు పథకాలు సాధించినట్లు కోచ్ పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 51 కేజీల విభాగంలో పి.మహాలక్ష్మి కాంస్య పథకం,ఉషు చాంపియన్‌షిప్ పోటీల్లో 52 కేజీల విభాగంలో పి.మహాలక్ష్మి రజిత పథకం, 65 కేజీ విభాగంలో ఎ.సత్యశ్రీ వైష్ణవి కాంస్య పథకం సాధించారన్నారు. వీరిని కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు కెజపద్మనాభం అభినందించారు.

ఘనంగా మహబూబ్ సుభానీ గంధోత్సవం

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం పాత బస్టాండ్ సమీపంలో ఉన్న మహబూబ్ సుభాని దర్గా వద్ద 46వ గంధోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకులు బాబు, జహాన్, దంపతుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం నిర్వహించారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -కాకినాడ రూరల్

వైద్య విద్యను ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. మండలంలోని నేమాం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ కురసాల కన్నబాబు పాల్గొన్నారు. వైద్య కళాశాలలను చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టేందుకే ప్రయివేటీకరణకు కుట్రలు చేస్తున్నారని కన్నబాబు విమర్శించారు. వైద్యకళాశాలలపై ప్రజాభిప్రాయాన్ని కోటి సంతకాల రూపంలో సేకరించి గవర్నర్‌కు అందచేసి ప్రయివేటీకరణ ను అడ్డుకునేందుకే వైసిపి కోటి సంతకాల సేకరణను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి.



కోటి సంతకాల సేకరణలో కన్నబాబు

గంగాధర్‌కు మల్లాడి పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

అనారోగ్యంతో కాకినాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తాళ్లరేవు ఎంపిపి రాయుడు సునీత భర్త రాయుడు గంగాధర్‌ను పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. గంగాధర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. తన భర్తను పరామర్శించిన మల్లాడి కృష్ణారావుకు ఎంపిపి సునీత కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరామర్శలో ముమ్మిడివరం ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలో మత్తుమందు కీలకం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఏదైనా శస్త్ర చికిత్స చేసేటప్పుడు రోగికి వైద్యులు ఇచ్చే మత్తు మందు ఎంతో కీలకమని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ సువర్ణరాజు అన్నారు. గురువారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ అనస్తీసియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగి ఆరోగ్య స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని మత్తు ఇస్తారన్నారు. మత్తు వైద్యులు లేకుండా శస్త్రచికిత్సలు నిర్వహించడం సాధ్యం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్‌నాయుడు, రేలంగి బాపిరాజు, జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పట్టణంలో పోషణ్ కార్యక్రమం

ప్రజాశక్తి - పిఠాపురం

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ మహ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి హాస్పిటల్ డాక్టర్ వరలక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కెఎస్.అరుణశ్రీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

18న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్ నిమిత్తం చొల్లంగి, జి.వేమవరం ఫీడర్, చొల్లంగి హెడ్ క్యూటర్, పటవల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైల్వే సిఎండి కుటుంబం పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వరాలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే సిఎండి డాక్టర్ నిర్మల రాజారామ్ కుటుంబం ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కంటే జగదీశ్‌మోహన్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామిని, బాలా త్రిపుర సుందరిని దర్శించుకున్నారు. స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారావు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - యానాం

యానాం బిజెపి మాజీ అధ్యక్షుడు మాగాపు సుబ్బారావు గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తన సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. మాగాపు కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక జనమిత్ర సంపాదకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, తెలగా అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి, వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, అన్నా డిఎంకె కార్యదర్శి మంచాల సత్య సాయికుమార్, వ్యాపారవేత్త తోట రాజు, ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పెండెం ప్రకాష్ ఆయన మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.



పూలమాలలు వేస్తున్న ఎంఎల్‌ఎ గొల్లపల్లి

భారీ అరటి గెల

ప్రజాశక్తి - కరప

టిడిపి మండల అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు ఇంటి పెరటిలో మొలకెత్తిన అరటి చెట్టు ఓ అరుదైన గెల వచ్చింది. సాధారణంగా గెలల పరి మాణం 10-15 వరకు ఉండగా, ఈ చెట్టు 50కి పైగా అస్తాలతో అతిపెద్ద గెలను కాసింది. ఈ గెల బరువు 70-80 కిలోలకుపైగా ఉండే అవకాసం ఉందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు.



గెలను చూపుతున్న యజమాని